

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# రేపట్నించీ..

పది అడుగులకి రెండంగుళాలు ఎక్కువ వెడల్పున్న కారు వచ్చి, ముగ్గు గొట్టంతో గీసినట్టున్న గీసిన తెల్లని గీతల మధ్య ఆగింది. దాన్లోంచి ఆరడుగులకి రెండంగుళాలు తక్కువున్న, రాజశేఖరం అని పేరుపెట్టుకుందామనుకుని పొరపాట్న ఫణి అని పేరుపెట్టుకున్న నేను దిగాను. జేబులో గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ కోసం వెతికాను. ఆనక గుర్తొచ్చింది, నేను సిగరెట్ తాగనని, తాగినా అవి ఇక్కడ అమ్మరనీ. రింగులు రింగులుగా పొగవదులుదామని నోరు తెరిచాను. చలి కాలం కావటం చేత నోట్లోంచి పొగొచ్చింది.

***" ఈహహ దటీజ్ రజినీకాంత్"*** అనుకుంటూ విసురుగా కళ్ళ జోడు తీసి మూడు సార్లు గిరగిరా తిప్పి గాల్లోకి విసిరేసాను, అదొచ్చి సరిగ్గా కోటు జేబులో పడేట్టుగా. నేను కోటు వేసుకోక పోవడంతో అది నా వెనకాతల కిందపడి పచ్చడైంది. రాజశేఖరం గానీ, రజినీకాంత్ గానీ వెనక్కి తిరగరు, కిందకి చూడరు కాబట్టి అలాగే తడుముకుంటూ డాలర్ స్టోర్ లోకి ఎంటరైపోయాను. ఓ పక్కగా ప్లాస్టిక్ తీగలతో, లతలతో డొక్కులా వున్న ఓ క్రిస్మస్ చెట్టు కనబడింది. ఓ లతని ఆవేశంగా ఊపి

***"లతా ఎందుకు చేసావీ పని?"*** అన్నాను భారంగా. అది మాట్టాడలేదు. ***"నేచరల్లీ",*** అనుకుంటూ, అక్కడినించి తల తిప్పి పక్కకి చూసాను. నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను.

ఎఫెక్ట్ కోసం టీవీ సీరియల్లో కోడలు విలన్లా మూడు సార్లు తలతిప్పి చూసాను. మెడ పట్టేసి, తల అటే ఉండిపోయింది. ఈ సారి శరీరాన్ని జాగ్రత్తగా అటు తిప్పాను. జనం, జనం, ఎటుచూసిన మన పీనుగులే. హడావిడిగా డాలరు బహుమతులు కొనేసి పొట్లాలు కట్టించేస్తున్నారు.

***"ఒసేవ్, ఇది చూడు, తాజ్ మహల్ బొమ్మ. దీన్ని పేద్ధ పేకింగ్ చేసి మా తెల్ల బాసుగాడికిచ్చేస్తాను. నాకీసారి ప్రమోషన్ గేరంటీ"*** అంటూ ఆనందం పట్టలేక రంకెలేస్తున్నాడొక చీప్ దేశీ కుంక.

ఆ పక్క ఐల్ లో ఓ తెల్లాడు ఇలాంటిదే స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఆల్రెడీ కొనేసి పొట్లం కట్టించి దానిమీద చిన్న ఇండియా జెండా అంటిస్తున్నాడు. వాడు ఖచ్చితంగా ఈ కుంకకి బాసు అయ్యివుంటాడని నాకు అనుమానవేసింది. అయినా ఇలాంటి చీప్ ఫెలోస్ తో మనకేవిటి. రేపట్నించీ అయాం బాబుగారి స్టైలే వేరు. టోటల్లీ ఖూల్ మామా, హాన్. అందరూ జనవరి ఒకటి నాడు మొదలెడితే నేను

క్రిస్మస్ రోజే మొదలెట్టేస్తాను, నా న్యూ స్టైల్. న్యూలుక్, న్యూ రిజల్యూషన్స్, అంటే ఎ హీరో ఈజ్ బోర్న్ అన్నమాట. (*మీరేం కంగారు పడకండి, మరి కాసేపట్లో తగ్గిపోతుంది ఈ వెఱ్ఱి*).

అయినా అసలీ చీపు గాళ్ళ మధ్య, ఈ డాలరు స్టోరులో నేనేం చేస్తున్నానని కదా మీ డౌటు. వస్తున్నా అక్కడికే వస్తున్నా. ఏక్చువల్లీ ఐ బై వీక్లీ మరియు మంత్లీ ప్లానర్స్ అన్నమాట. మనకి పని తక్కువ, ప్లానింగు ఎక్కువ కదా. అసలు కొంచెం ఫ్లాష్ బేక్ లోకెడితే, కొన్నేళ్ళపాటు నా క్రెడిట్ కార్డు వాడు నాకు అందమైన డైరీలు, ఎడ్రసులు రాసుకునే పుస్తకాలు, బాల్ పెన్నూ పంపించేవాడు, నా పేరు కూడా బంగారం రంగులో అచ్చేయించి. ఆ బాల్ పెన్ను టేబుల్ మీద ఓ సారి నొక్కి వదిలితే ఎం**...**త**...**పైకి ఎగురుతుందో. ఆ బుజ్జిముండ తో ఆఫీసులో బోల్డు బెట్ లు కూడా గెలిచాను. ఏదో మన పేరు ప్రతిష్టలు క్రెడిట్ వాడికీ తెలిసుంటాయి కామోసు అందుకే ఉడతా భక్తిగా ఇవన్నీ పంపిస్తున్నాడనుకున్నానే తప్ప, అన్నేళ్ళలోనూ ఏనాడూ అనిపించలేదు, వాడు ఓ వంద డాలర్లు వడుకుతున్నాడని. ఓ నాడు మా శాల్తీ క్రెడిట్ కార్డు బిల్లు చూసి ఘొల్లుమంది. అప్పుడు నాకు బుద్ధి వికసించి, ఆ ఏడాది నించీ, డైరీలు, ప్లానర్లూ మరి.. డాలర్ స్టోరులోనే..ఇహిహి**...**అదన్నమాట.

సర్లెండి, ఇంతకీ డయిరీలు, పుస్తకాలు ఉన్న సందులోకి దూరుతుంటే కనబడ్డాయి చిన్ని చిన్ని ప్లాస్టిక్కు బొచ్చెలు. ఐస్క్రీం వేసుకుందుకు బావుంటాయనిపించింది. వెంటనే మెరుపులాంటి ఊహ తట్టింది. క్రితం సారి క్రిస్మస్ కి భాస్కర్ గాడు అందరికీ గిఫ్టులు కొన్నాడు కదా, ఈ సారి మనం భాస్కర్ గాడికే కాకుండా, శివ, ప్రసన్న, సతీష్ కి కూడా కొనేసేద్దాం, కాదు కాదు వాళ్ళ వైపులకి కూడా కొనేద్దాం. పోతే పోయాయి, ఎనిమిది డాలర్లు. అవి వాళ్ళకి ప్రెజెంట్ చేసి, ఎప్పుడన్నా వాళ్ళింటికి డిన్నర్ కెళ్ళినప్పుడు, వచ్చేసే ముందు, స్టైల్ గా ***"ఐస్క్రీం తిందామా"*** అనేసి, వాళ్ళు మనం గిఫ్టిచ్చిన కప్పుల్లో ఐస్క్రీం పెట్టి, ***"అన్నయ్యా, ఇది మీరిచ్చిన కప్పే"*** అని ఆరాధనా భావంతో చూసి" ఓహ్..వాటెనైడియా.. అనుకుంటూండగానే ***"అన్నయ్యా బావున్నారా"*** అని వినిపించడంతో పక్కకి చూసాను. పక్కనే ఒకానొక చెల్లి. నాకు డౌటొచ్చి ఆవిడ కార్టులో చూసాను, ఐస్క్రీము కప్పులేవన్నా వున్నాయేమోనని. పూర్తిగా చూసేలోపే ఆవిడ ***"వస్తానన్నయ్యా, రేపు క్రిస్మస్ కి వీలైతే కలుద్దాం"*** అనేసి గబ గబా వెళ్ళిపోయింది. నా గుండె జారి గల్లంతైంది. చేసేది లేక ఎప్పటిలాగే మూడు ప్లానింగ్ పుస్తకాలు కొని, కొట్టు వాడికి సొమ్మిచ్చి, అక్కణ్ణించి బైటపడ్డాను.

ఆహాలు మనకి చిన్నప్పటినించీ ఏరోజు అల్లరి ఆరోజే, ఏరోజు దెబ్బలు ఆరోజే. ఇంత అల్లరికి ఇన్ని దెబ్బలు అని ఓ లెఖ్ఖ ఏడిసేది. ఆ అల్లరి చేసేసి, ఆ దెబ్బలు తినేసి, మర్నాటికి మళ్ళీ తయరైపోయేవాణ్ణి దర్జాగా. యీ ప్లానింగులూ, డొంకీ ఎగ్గులూ మనకి తెలీదు. రేపన్న రోజు ఏ అల్లరి చేస్తామో ఇవాళే ఎలా చెప్పగలం? మేష్టారు బెత్తవెట్టి అలిసిపోయే దాకా (ఆయన) రేవెట్టి, చివరికి దీనంగా పీల గొంతుతో అడిగే వారు ***" రేపణ్ణించీ హోమ్ వర్కు పూర్తిగా చేస్తావా?"*** అని. నేను ఓ మాటు దీర్ఘంగా ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చి, ***"చెప్పలేనండి"*** అనే వాణ్ణి నిజాయితీగా. ఆయన నాకు సాష్టాంగపడి, ఆ మర్నాటినించీ ఓ వారం సెలవు మీద వెళ్ళేవారు. అయితే అన్ని రోజులూ ఒక్కలాగే ఉండేడవవు కదా. ఎనిమిదో క్లాసులో ఓ రోజు సాయంత్రం అంతా తారుమారైపోయింది. ఓ సాయంకాలం మా డాబా మీద ఎక్కి, గాలిపటం ఎగరేసుకుంటున్నాను. అది ఎగిరెళ్ళి ఓ కరెంటు తీగకి తగులుకుంది. దాని తోక వెళ్ళి

రెండో తీగకి చుట్టుకుంది. సాధారణంగా మా కోలనీలో నాకు తెలిసి ఒక వైరులోనే కరెంటిస్తాడు, మిగిలినవి బట్టలారేసుకోడానికీ, పిల్లలు, పిట్టలు ఊగడానికీ ఒదిలేస్తాడు, అందుకే భస్తినిరో అన్నట్టు వెలుగుతూ ఉంటాయి లైట్లు. ఆరోజు మన పూర్వ జన్మల కర్మ ఫలాన్ని అనుసరించి రెండు వైర్లలోనూ కరెంటిచ్చినట్టున్నాడు. మనకేం తెలుసు, దారం కాస్త గెట్టిగా లాగేహరికి ఎప్పుడో విడిపోయిన వైర్లు మళ్ళీ క్లైమాక్సులో కలుసుకున్నాయి, ఎక్కడో ట్రాన్సాఫ్ఫర్మర్ దగ్గర ఓ చిన్న సైజు విస్ఫోటనం జరగడం, కాలనీ అంతా కరెంటు పోవడం వెంత వెంఠనే జరిగిపోయాయి. నేరం నాది కాదు గాలిపటానిది అనుకుంటూ, మెల్లిగా నా దారం వున్న చరఖా పక్కింటి డాబా మీదకి విసిరేసాను, ఎవిడెన్సు చెరిపేద్దావని. దాన్ని వాటర్ టాంకు వెనకాల కూచుని వెనకింట్లో వున్న నా గరల్ ఫ్రెండుకి ఈల సందేశం పంపిస్తున్న సునీల్ గాడు కేచ్ చేసి, పైకి లేచొచ్చి,

*"చూసేసా, మీ నాన్నకి చెప్పేస్తా.."* అంటూ మొదలెట్టాడు.

ఇంక లాభంలేదని చర్చలకి పిలిచి, వాడి డిమాండ్లేవిటో చెప్పమన్నాను.

*"నీ గోళీల సంచీలోంచి పది పెద్ద గోళీలు, నీ స్పంజి కార్కు క్రికెట్ బాలు వెంఠనే ఇచ్చేయాలి."* కర్కశంగా చెప్పాడు.

చేసేది లేక సరే అన్నాను. *"అంతేకాదు చాలా ఇంపార్టెంటుది విను, వెనకింట్లో వున్న శ్వేతా బసు ని మర్చిపోవాలి. అది నాది"* క్రూరంగా కూసాడు.

ఇంక నేను తట్టుకోలేకపోయాను. నేను, శ్వేత బాసు ఆల్రెడీ మా పెళ్ళి కార్డుల మీద ఒక పక్క కలకత్తా కాళికాదేవి బొమ్మా, ఇంకో పక్క అయినవిల్లి వినాయకుడి బొమ్మా వేయించాలని డిసైడయి, పెళ్ళి హైదరాబాదులోనా, లేక కలకత్తాలోనా అని ఫైనలైజ్ చేసుకుంటున్నాం. అందుచేత సున్నితంగా తిరస్కరించాను. వాడు వెంఠనే వాకౌట్ చేసి, నేను మేడ దిగే లోపు, మాయింట్లో దూరేసి, **"శ్వేత"** పత్రం సమర్పించి పారిపోయాడు.

నేను ఇంట్లోకొచ్చి, ఏం జరుగుతుంతో తెలుసుకునేలోపు నన్ను మా వంటిల్లు, కం టార్చర్ రూం, కం గేస్ చాంబర్లో బియ్యప్పీపాకి కట్టేసారు. ఎఫెక్ట్ కోసం ఎదురుగా ఓ కొవ్వొత్తి వెలిగించారు. ఆ కొవ్వొత్తి వెలుగులో వాయిస్ ఓవర్ వినిపిస్తోంది..

*"వెధవ, వెధవన్నర వెధవ, గాలి పటాలు కావాలిరా నీకు. చదువు లేదు, సంధ్య లేదు"* అంటూ నన్ను,

*"అందుకే చెప్పాను నీకు, చారూ అన్నం మాగాయి ముక్కా పెట్టి పెంచితే కుక్కిన పేనులా పడి ఉందుడు, బాగా రుచులు మప్పావు.."* అని అమ్మనీ కంబైండుగా కబాడీ ఆడి, చివరిలో ఎంట్రీ ఇచ్చి,

*"ఇవాళ నించీ ఒక టైంటేబుల్ ప్రకారం నడుచుకోకపోతే చీరేస్తాను. తాట తీసేస్తాను. అంట్ల వెధవ. దినచర్య రాయకపో నీ అంతు చూస్తాను. ఇలా అల్లరి చేస్తే...అడుక్కుతినాలి, సంక నాకాలి..."* అంటూ ఓ పెన్ను పేపరు తెచ్చి

*"రాయి...రేపట్నించీ ఏం చెయ్యాలి, ఏంచెయ్యాలి".* అన్నారు కిష్టంరాజులా కళ్ళు పెద్దవి చేసి, పిడికిలి బిగిస్తూ.

నేను టూ.కీ.గా *"రేపట్నించీ అడుక్కుతినాలి, సంక నాకాలి..."* అని రాసాను, ముందు చెప్పిందంతా గుర్తులేక.

ఆయన కాసేపు నామీద బాక్సింగు ప్రాక్టీసు చేసుకుని వెళిపోయారు.

ఆ తరవాత అమ్మ వచ్చి ***"మాతృభాష"*** లో ఇదే విషయాన్ని చెప్పింది.

ఆనక అన్నొచ్చి నాకు ప్లానింగు లో అక్షరాభ్యాసం చేసి, టైంటెబులు వేసి వెళిపోయాడు. మొదట రెండ్రోజులు నాన్న గారు సంతకం చేసారు, తరవాత అమ్మ. వారం తిరిగే సరికి అన్నే చెక్ చేసి సంతకం చేసేవాడు. తరవాత నాకు వాడి సంతకం బాగా చెయ్యి తిరిగాకా, స్వయం కృషినే నమ్ముకునేవాణ్ణి. ఫాలో అయినా అవకపోయినా ప్లానింగు చేసే అలవాటు ఇప్పటికీ వదల్లేదు.

కట్ చేస్తే, ఇంటికొచ్చి మా ముఠా సభ్యులంతా పక్కేక్కాకా, పిల్లిలా నా ఆఫీసు రూములోకొచ్చి, ఆవేశంగా డైలీ ప్లానరు తీసాను. రేపట్నించీ...ఠట్ఢడాయ్...( ***వీడు ఐదడుగుల పెసరట్టు, బెల్లం వేసిన బొబ్బట్టు,.. రేపట్నించీ మీ పనిపట్టు, మీమీదొట్టు మీమీదొట్టు.. అంటూ టైటిల్ సాంగు వస్తుందన్నమాట,)..పొద్దున్నే ఐదు, ఛీ కాదు, నాలుగున్నరకి లేచి భార్య నమస్కారాలు, ఐ మీన్ సూర్య నమస్కారాలు చెయ్యాలి. అపుడు, ప్రాణాయామం చేసి,టబ్ లో కూర్చుని సంగీత సాధన చెయ్యాలి "సా..రి..గ రి..గ..ప దా...పా..." అంటూ. మధ్యలో పల్లవి వచ్చి, తప్పు పాడుతూంటే "హూ...పల్లవీ" అని దాన్ని కరెక్ట్ చెయ్యాలి. అదయ్యాకా స్నానం, సంధ్యావందనం, వేద పఠనం, పూజ, పునస్కారం(అంటే ఏంటి?), తరువాత ఓట్ మీల్ తినుట, ఆనక ఐదు ఛీ కాదు, ఎనిమిది, ఛీ ఛీ కాదు పది మైళ్ళు పరిగెత్తి వచ్చి మళ్ళీ స్నానం చేసి ఆఫీసుకెళ్ళాలి. అందరినీ చిరునవ్వుతో గెలిచి, ప్రమోషన్ల మీద ప్రమోషన్లు కొట్టేసి, సాయంత్రం జిమ్ము కెళ్ళి , మైనే ప్యార్ కియాలో కుఱ్ఱాడిలా ఎడం చేత్తో యాభై, కుడి చేత్తో యాభై బస్కీలు తీసేసి, రాత్రి ఇంటికొచ్చి వెజిటబుల్ జ్యూసు తాగి, నాలుగు మైళ్ళు నడిచి వచ్చి పడుకోవాలి. ఇలాగే వచ్చే సంవత్సరమంతా చెయ్యాలి"*** అని రాసేసి, ఆ పుస్తకాన్ని పాత డైరీల పక్కన పెట్టేసి తృప్తిగా పడుకున్నాను.

మర్నాడు లేచేసరికి పదకొండైంది. మిగిలిన శాల్తీలు ఇంకా లేవలేదు. పిల్లని లేపుదావని దాని రూములోకి వెళ్ళాను. అదింకా మూడో ఝాము నిద్దర్లో ఉంది. దాని తలగడ పక్కన ఓ కాయితం ఉంది. తీసి చూసాను.

***"రేపట్నించీ సిక్స్ కి లేవాలి. వన్ అవర్ రీడింగ్, ట్వెంటీ మినిట్స్ వాకింగ్, టూ అవర్స్ లెఖ్ఖలు,"*** ఇలా కాగితానికి అటూ ఇటూ నింపేసింది.

***"బాబు పోలిక అని అంతా అటూంటే ఏమో అనుకున్నాను గానీ, నిజమే, అక్షరాలా అయాం బాబునే పోలింది"*** అని లేని మీసం దువ్వుకుంటూ, నవ్వు కుంటూ, నా గదిలోకి నడిచాను.

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS